సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 17 । నవంబర్ । 2024



కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం

కామారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో అధికారుల నిర్లక్ష్యంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 8లో ▸



నీటి సంఘాలకు..

జిల్లాలో చెరువుల నిర్వహణను పట్టించుకునే వారు లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.8 /16.6

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

సర్వేను వేగవంతం చేయండి



లింగంపేట/తాడ్వాయి : సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన లింగంపేట, తాడ్వాయి మండల కేంద్రాల్లో సర్వేను పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. పకడ్బందీగా సర్వే చేయాలని ఆదేశించారు. సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. అందుకోసం కంప్యూటర్ ఆపరేటర్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు నరేశ్, సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ నరేందర్, ఎంపీవోలు మలహరి, సవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో రేపు చేపపిల్లల విడుదల

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో సోమవారం చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన చేప పిల్లలను ప్రాజెక్ట్‌లో వదులుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరు అవుతారని తెలిపారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



కామారెడ్డి టౌన్ : ఎస్‌సీఎస్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దత్తాశ్రమంలో శనివారం మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. హైదరాబాద్ నుంచి 10 మంది ప్రత్యేక వైద్యుల బృందం వచ్చి వంద మంది మహిళలకు పరీక్షలు చేసింది. అనంతరం వైద్యులను దత్తాశ్రమం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ వెంకటకృష్ణ, లక్ష్మణరావు, సీతారామరావు, రాధారమణ, చంద్రశేఖర్, ఉమారెడ్డి, రాజ్యలక్ష్మి, మాళవిక, అరవింద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



కామారెడ్డి క్రైం : జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రెండు వందల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

అధికారులపై దాడులు ఆటవిక చర్య



సుభాష్‌నగర్: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై రైతులు దాడి చేయడం, బోధన్ మండలం ఊట్‌పల్లి అసిస్టెంట్ లైన్‌మన్ నవీన్‌పై దాడికి పాల్పడటం ఆటవిక చర్యగా ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ అభివర్ణించారు. ఈ దాడులను ఖండిస్తూ ఎలక్ట్రిసిటీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పవర్ హౌస్‌లో నిరసన తెలిపారు. రవీందర్ మాట్లాడుతూ అధికారులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్, 1104 యూనియన్ కంపెనీ ప్రెసిడెంట్ రఘునందన్, 327 యూనియన్ సెక్రటరీ గంగాధర్ మాట్లాడారు. ఆందోళనలో జేఏసీ కో కన్వీనర్ తోట రాజశేఖర్, డీఈఈలు ఏ రమేష్, వెంకటరమణ, సురేష్‌కుమార్, జి శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, గంగారాం నాయక్, నాంపల్లి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

చేయి తిరిగినోళ్లు!



జనాభా నియంత్రణ కోసం నిర్వహించే కు.ని. ఆపరేషన్లు చేయడంలో ఆ వైద్యుడు దిట్ట. తన సర్వీసులో దాదాపు 2.20 లక్షల ఆపరేషన్లు చేసి ఎన్నో అవార్డులు అందుకున్నాడు. మరొకరు అపురూపమైన చిత్రాలు గీసి ప్రాణం పోస్తున్న చిత్రకారుడు. గాంధారి మండల కేంద్రంలో స్థిరపడ్డ డాక్టర్ రాజమౌళి చేయి తిరిగిన వైద్యుడిగా, అలాగే ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గోపాల్‌గౌడ్ చేయితిరిగిన చిత్రకారుడిగా గుర్తింపు పొందారు. వాళ్ల సక్సెస్‌పై సండే స్పెషల్..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

■ ఒకరు కు.ని. ఆపరేషన్లలో దిట్ట ■ మరొకరు చిత్రకళలో రారాజు
■ ఆదర్శంగా నిలుస్తున్న వైద్యుడు, చిత్రకారుడు

సండే స్పెషల్

కు.ని. అంటే గుర్తొస్తాడు..

ఉమ్మడి జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లంటే వినిపించే పేరు డాక్టర్ రాజమౌళి. కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి 1997 మార్చి 18న గాంధారి వైద్యాధికారిగా వచ్చిన ఆయన అక్కడే స్థిరపడ్డారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించే సర్జన్‌గా 2002 నుంచి ఉద్యోగ విరమణ చేసేదాకా ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల పైచిలుకు ఆపరేషన్లు చేసి రికార్డు నెలకొల్పారు. కామారెడ్డి, బాన్సువాడ, గాంధారి, దోమకొండ, బిచ్కుంద, పిట్లం, ధర్పల్లి, ఎల్లారెడ్డి.. ఇలా ఎక్కడ డీపీఎల్ క్యాంపు పెట్టినా అక్కడికి డాక్టర్ రాజమౌళి బృందం వెళ్లాల్సిందే. ల్యాప్రోస్కోపిక్ ద్వారా కోత, కుట్టులేని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంలో ఆయన దిట్టగా పేరు సంపాదించారు. రాజమౌళి 2014లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన పనిచేసిన కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సార్లు ఉత్తమ డీపీఎల్ సర్జన్‌గా, ఐదు సార్లు ఉత్తమ వైద్యాధికారిగా అవార్డులతో సత్కరించింది. ఉమ్మడి జిల్లాలో 12 ఏళ్ల కాలంలో డీపీఎల్ ఆపరేషన్లు 1.75 లక్షలు, ట్యూబెక్టమీ ఆపరేషన్లు 45 వేలు చేశారు. ప్రస్తుతం గాంధారి మండల కేంద్రంలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని అక్కడే ఆస్పత్రి నిర్వహిస్తూ సేవలందిస్తున్నారు. ఆయన సంతానంలో పలువురు వైద్యరంగంలో కొనసాగుతున్నారు.



అప్పటి కలెక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ రాజమౌళి

ఆ ఆపరేషన్లు మరచిపోలేనివి



ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా యోగితారాణా ఉన్న సమయంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలో ఎక్కువగా శ్రద్ధ చూపారు. డీపీఎల్ క్యాంపులు పెట్టించి వీలైనన్ని ఎక్కువ ఆపరేషన్లు జరగాలని చెప్పేవారు. అప్పట్లో హెచ్ఐవీ బాధితులైన 75 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయించారు. వారందరికీ చేశాను. అది ఎప్పటికీ మరచిపోలేనిది. కెరీర్ మొత్తంలో 2.20 లక్షల ఆపరేషన్లు చేశాను.

– డాక్టర్ రాజమౌళి, గాంధారి

జీవకళ ఉట్టిపడే చిత్రాలు

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన చుక్క గోపాల్ గౌడ్‌కు చిన్నప్పటి నుంచే చిత్రకళపై ఆసక్తి. తనకు చిత్రకళపై ఉన్న ఆసక్తితో 1979లో హైదరాబాద్ జేఎన్‌టీయూలో చేరి చిత్రకళకు పదును పెట్టుకున్నాడు. తాను చూసిన, మనసులో అనుకున్న వాటిని గీయడం ద్వారా అధ్యాపకుల మన్ననలు పొందాడు. తన చదువు పూర్తయ్యాక వివిధ సంస్థల్లో చిత్రకారుడిగా పనిచేశాడు. ఆయన గీసిన చిత్రాలు దేశ, విదేశాల్లో గుర్తింపు పొందాయి. ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయన ఏ బొమ్మ గీసినా అందులో జీవకళ ఉట్టిపడుతుంది. దేవతామూర్తులతో పాటు ప్రకృతిని తన కుంచెలో బంధిస్తాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పోట్రేట్ పెయింటింగ్ లో కూడా రాణిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసి రిటైర్మెంట్ తరువాత సొంతూరికి చేరుకున్న గోపాల్‌గౌడ్ తన కళకు మరింత పదును పెడుతున్నాడు.

ఆసక్తి తగ్గలేదు

చిన్నప్పటి నుంచి చిత్రకళపై ఉన్న ఆసక్తితో గీసిన చిత్రా లు ఉన్నతుడిని చేశాయి. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూ డా అందిపుచ్చుకోవడం ద్వా రా మరింత రాణించవచ్చని గ్రహించా. దశాబ్దాలు గడిచినా చిత్రకళపై ఆసక్తి పెరిగిందే తప్ప తగ్గలేదు. నిరంతరం కొనసాగిస్తూనే ఉంటాను. గీసిన చిత్రాల్లో జీవకళ ఉండాలన్నదే నా తపన. నలుగురికి నచ్చితే ఆ సంతోషం వేరు. ఇలాగే కొనసాగిస్తా.

– చుక్క గోపాల్‌గౌడ్, చిత్రకారుడు

నేటి నుంచి గ్రూప్–3 పరీక్షలు



కామారెడ్డిలోని ఓ పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

- జిల్లాలో పరీక్ష రాయనున్న 8,268 మంది అభ్యర్థులు
- జిల్లా కేంద్రంలో 20 పరీక్షా కేంద్రాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

కామారెడ్డి టౌన్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్– 3 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆది, సోమవారాలు నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8,268 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఈ పరీక్షలకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి జిల్లా నోడల్ అధికారిగా, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి పోలీస్ నోడల్ అధికారిగా, డా.కె విజయ్ కుమార్ రీజనల్ కో ఆర్డినేటర్‌గా, డా.వి.శంకరయ్య అసోసియేట్ రీజనల్ కో– ఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 21 మంది అబ్జర్వర్లు, ఒక స్పెషల్ అబ్జర్వర్, నలుగురు రూట్ ఆఫీసర్లు, 63 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 360 మంది ఇన్విజిలేటర్లు, జిల్లా యంత్రాంగం నుంచి నలుగురు జాయింట్ రూట్ ఆఫీసర్లు, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 93 మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, 100 మందికి పైగా పోలీసు సిబ్బందిని నియమించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో జరగబోయే గ్రూప్–3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సింధుశర్మ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

అరగంట ముందే గేట్లు బంద్

గ్రూప్–3 పరీక్షకు మూడు పేపర్‌లు ఉంటాయి. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు రెండో పేపర్ ఉంటుంది. సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మూడో పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి గంటన్నర ముందు అనుమతి ఇస్తారు. అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు వెంట ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. ఒకే హాల్ టికెట్‌ను మూడు పరీక్షలకు ఉపయోగించాలి. బయోమెట్రిక్ అటెండెన్స్ (వేలి ముద్రలు), ఫొటో తీసుకోవడం ద్వారా హాజరు నమోదు చేస్తారు. చేతికి మెహెందీ, టాటూలు ఉండొద్దు. అవి అవి ఉంటే బయోమెట్రిక్ పరికరం హాజరు గుర్తించదు.

భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం



నస్రుల్లాబాద్ : జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న నస్రుల్లాబాద్ మండల రైతులతో శనివారం సబ్ కలెక్టర్ కిరణ్మయి సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన భూ వివరాలను తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందేలా చూస్తామన్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. నస్రుల్లాబాద్ ఇళ్లు కోల్పోతున్న వారికి ముందస్తు నోటీసులు అందిస్తామని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ప్రవీణ్, గిర్దావార్ అంజు, రైతులు అరిగె సాయిలు, పోచయ్య, వెంకటి పాల్గొన్నారు.

గర్భంలోనే శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమని బంధువుల ఆరోపణ
- జీజీహెచ్‌లో నాలుగు రోజుల్లో రెండు ఘటనలు



శిశువు మృతదేహంతో రోదిస్తున్న కుటుంబీకులు

కామారెడ్డి టౌన్ : ఓ శిశువు లోకం చూడకుండానే తల్లి గర్భంలోనే మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంతోనే బిడ్డ మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డికి చెందిన రాధకు ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన శేఖర్‌తో వివాహమైంది. వారికి ఒక కుమారుడు ఉండగా, రాధ మళ్లీ గర్భిణి. పురిటి నొప్పులు రావడంతో రెండో కాన్పు కోసం శనివారం ఉదయం 06:30 గంటలకు జిల్లా ఆస్పత్రికి వచ్చారు. అయితే వైద్యులు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. మొదటి కాన్పు ఆపరేషన్ అయిందని, ఇప్పుడు కూడా ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులు వైద్యులను వేడుకున్నారు. అయినా వైద్యులు వినిపించుకోకుండా సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. సుమారు నాలుగు గంటల పాటు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించగా కాన్పు కాలేదు. దీంతో హడావుడిగా ఆపరేషన్ థియేటర్‌కు తరలించి సీజేరియన్ చేశారు. అప్పటికే గర్భంలోనే శిశువు మృతి చెందంది. దీంతో కుటుంబ సభ్యులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో వాగ్వాదం చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు. నాలుగు రోజుల క్రితం పట్టణానికి చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం వస్తే వైద్యుల నిర్లక్ష్యంతో గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు తెలిసింది. నాలుగు రోజుల్లో ఇద్దరు శిశువు మృతి చెందడంతో ఆస్పత్రి వైద్యుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఫరీదాను వివరణ కోరగా బిడ్డ మెడకు పేగు చుట్టుకుని ఉండటం, ఉమ్మ నీరు మింగటంతో మృతి చెందిందని తెలిపారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి క్రైం : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ దివ్యాంగుల క్రీడా పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చందర్ నాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో రచ్చ!

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన సుభాష్‌రెడ్డి
- తన అనుచరులపై దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం
- దమ్ముంటే తనతో తేల్చుకోవాలని సవాల్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న విభేదాలు మరో మారు రచ్చకెక్కాయి. ఇక్కడ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, మరో నేత సుభాష్‌రెడ్డి అనుచరులు వర్గాలుగా విడిపోయారు. రామారెడ్డి మండలం రంగంపేటలో తన అనుచరుడిపై ఎమ్మెల్యే వర్గీయులు దౌర్జన్యం చేశారని, ఎమ్మెల్యేకు దమ్ముంటే తనతో తేల్చుకోవాలని సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో గ్రూపు గొడవలు మరోమారు తెరపైకి వచ్చాయి. నాలుగైదేళ్లుగా ఇరువర్గాల మధ్య గొడవలు నడుస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇద్దరు నేతలు పోటీపడ్డారు. మదన్‌మోహన్ టిక్కెట్ సాధించగా, తనకు అన్యాయం జరిగిందంటూ సుభాష్‌రెడ్డి తిరుగుబాటు చేసి బీజేపీలో చేరారు. ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. మదన్ మోహన్ విజయం సాధించడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ అంతా ఎమ్మెల్యే చేతిలోకి వెళ్లింది. అయితే కొంతకాలానికే సుభాష్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. సుభాష్‌రెడ్డి వర్గం నేతలంతా ఆయనతోనే ఉన్నారు. ఇటీవల ఎల్లారెడ్డిలో సుభాష్‌రెడ్డి కార్యాలయం వద్ద ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేదని ఆయన వర్గం వారు గొడవకు దిగారు. అలాగే రామారెడ్డి మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, నేతలు ఎమ్మెల్యే పీఏలను టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. వీటిని మరిచిపోకముందే తాజాగా తన వర్గీయుడిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారంటూ సుభాష్‌రెడ్డి విమర్శలు చేయడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తుంటే ఎల్లారెడ్డిలో రౌడీ రాజ్యం నడుస్తోందని సుభాష్‌రెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం గమనార్హం. సుభాష్‌రెడ్డి ఆరోపణలపై ఎమ్మెల్యే వర్గం ఎలా స్పందిస్తుందో చూడాలి.

నామినేటెడ్ కిరికిరి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సుభాష్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు ఏ ఒక్కరికీ నామినేటెడ్ పదవులు దక్కలేదు. దీంతో నేతల్లో అసహనం పెరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న సుభాష్‌రెడ్డి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే మదన్‌మోహన్ సమ్మతి లేకుండా పదవి వస్తుందా అన్నదానిపై ఊహాగానాలు నడుస్తున్నాయి. సుభాష్‌రెడ్డికి పదవి వస్తే, నియోజకవర్గంలో మరో అధికార కేంద్రం అవుతుందన్న అభిప్రాయం ఉంది. నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ పదవులన్నీ ఎమ్మెల్యే అనుచరులకే దక్కాయి.

రాష్ట్ర నాయకత్వం చొరవ చూపితేనే..

రాష్ట్ర నాయకత్వం చొరవ చూపితే తప్పా ఎల్లారెడ్డిలో నేతల మధ్య గొడవలు సద్దుమణిగే పరిస్థితులు కనిపించడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు అంశం మరిన్ని గొడవలకు కారణమవుతుందని భావిస్తున్నారు. ఎమ్మెల్యేనే నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తుండడంతో ఆయన అనుచరులకే నామినేటెడ్, పార్టీ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పిస్తారు. దీంతో సుభాష్‌రెడ్డి వర్గీయులకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం చొరవ చూపి సమస్య పరిష్కరించకుంటే విభేదాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

కార్యకర్తలకు అండగా ఉంటా

రామారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు తన వెంటే ఉన్నారని, వారిపై దాడులు చేయిస్తూ ఎమ్మెల్యే మదన్‌మోహన్ దౌర్జన్యం చేస్తున్నారని వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆరోపించారు. మండలానికి చెందిన రంగంపేట గ్రామ కాంగ్రెస్ నేత అనీఫ్ ఇంటికి వచ్చి శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే అనుచరులు దాడికి యత్నించారని ఆరోపించారు. శనివారం ఆయన రంగంపేటలో విలేకరులతో మాట్లాడారు. దాడితో అనీఫ్ తల్లికి గుండెపోటు వచ్చిందని ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతుంటే నియోజకవర్గంలో మాత్రం రౌడీ, రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. అనీఫ్ చెరుకు తోటకు నిప్పు పెట్టినట్లు ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, స్వామిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సంతోష్, షరీఫ్, బాల్‌రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి, నిజాం, సంగెం రాజు, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్ల సంఖ్య పెంచాలి

కామారెడ్డి టౌన్ : సమగ్ర సర్వేకు ఎన్యుమరేటర్ల సంఖ్య పెంచాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, డీఈవో రాజుకు వినతి పత్రాలను అందజేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, లింగం మాట్లాడుతూ.. సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు తీవ్రంగా ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. సర్వే గడువు పొడగింపునకు ప్రభుత్వానికి నివేదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నళినిదేవి, కార్యదర్శి నరేందర్, లక్ష్మి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

నేర పరిశోధనలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎండీ రహీమొద్దీన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశానికి ఉమ్మడి జిల్లాలకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హాజరుకాగా.. కొత్త న్యాయ చట్టాలు భారతీయ న్యాయసంహిత–2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత– 2023, భారతీయ సాక్ష్య అధినియం–2023 లపై, కేసుల పరిశోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అవగాహన కల్పించారు. నేర పరిశోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన చట్టాలను అవలంభించి నేరస్తులకు శిక్షపడేవిధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వారి పరిధిలోని పోలీసులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పీసు రాజేశ్వర్, బంటు వసంత్, రాజ్‌గోపాల్‌గౌడ్, నిమ్మ దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ ఖాందేష్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అశోక్, శివరాంనాయక్, చిదిరాల రాణి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఈషా గ్రామోత్సవ్ ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఈషా ఫౌండేషన్ గ్రామోత్సవం క్రీడాపోటీలను అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యురాలు వసంత గీత మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడాపోటీలు దోహదపడతాయన్నారు. మొదటి రోజైన శనివారం వాలీబాల్‌పోటీలు నిర్వహించగా, ఆదివారం త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

ఆ చోటనే ప్రమాదాలు..

- తడపాకల్ గోదావరిలో ప్రమాదకరంగా రెండు పాయింట్‌లు
- కొట్టుకుపోయిన హెచ్చరిక బోర్డులు
- నుడిగుండాల్లో కలుస్తున్న ప్రాణాలు



గోదావరి నదిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతం

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ గోదావరి తీరంలో రెండు పాయింట్‌లు ప్రమాదకరంగా మారాయి. తరచూ ఆ ప్రాంతాల్లోని ప్రమాదాలు చోటుచేసుకుని భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. పదేళ్లలో సుమారు 20 మంది నీట మునిగి మృతి చెందారు. ఈత వచ్చిన వారు సైతం ప్రాణాలు కోల్పోవడానికి అక్కడ ఉన్న సుడిగుండాలే కారణమని స్థానికులు అంటున్నారు. నదిలో రెండు చోట్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అక్కడ ఇప్పటి వరకు ఏనాడూ నీరు ఎండిపోయిన జాడ లేదని స్థానికులు తెలిపారు. ఎంతటి ఎండాకాలమైనా నీరు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు.

పట్టించుకునే వారేరి..?

తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రెండు రోజుల కింద మాక్లూర్ మండలం మానిక్‌బండార్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి రామ్‌చరణ్ గోదావరిలో పెద్దవాగు కలిసే ప్రాంతానికి వెళ్లి నీట మునిగి మరణించాడు. అతను నీటిలో మునిగిన సమయంలో తన కొడుకును రక్షించుకోవడానికి తల్లి గంగామణి సైతం నీటిలోకి దూకింది. ఆమెను గుర్తించిన స్థానికులు ఇద్దరిని బయటకు తీసినా రామ్‌చరణ్ ప్రాణాలు మాత్రం దక్కలేవు. ఇలా రామ్‌చరణ్ ఒక్కడే కాకుండా గతంలోనూ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఐదు నెలల కింద స్థానిక పశువుల కాపరి ఎప్పటిలాగే తన పశువుల మందతో గోదావరి నదికి అవతలి వైపునకు వెళ్లగా అతను నీటిలో మునిగి మరణించాడు. అతడికి ఈత రావడంతోపాటు గోదావరిపై పూర్తి అవగాహన ఉన్నప్పటికీ ప్రాణాలతో బయటపడలేదు. ఏడాది కింద నిజామాబాద్‌లోని బ్యాంకు కాలనీకి చెందిన బ్యాంకు ఉద్యోగి మరణించాడు. కొందరికి ఈత వచ్చినా నీరు సుడి తిరగడంతో బతికి బట్టకట్టలేకపోయారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే చోట్ల గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు నీటిలో కొట్టుకుపోగా, మళ్లీ ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి గోదావరి నది వద్ద ప్రమాద సూచికలను మరోసారి ఏర్పాటు చేయించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

గతంలో బోర్డులు ఏర్పాటు చేయించాం

గోదావరిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న చోట్ల హెచ్చరిక బోర్డులను గతంలో ఏర్పాటు చేయించాం. అవి కొట్టుకపోయాయి. ప్రమాదాలు ఒకటి, రెండు చోట్లనే జరుగుతున్నాయి. ఇందుకు కారణం ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదు. భక్తులు జాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రమాదాల ముప్పు తప్పుతుంది.

– పత్తిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్, తడపాకల్

అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ



అధికారులను నిలదీస్తున్న కౌన్సిల్ సభ్యులు

- 16 ఎజెండా అంశాలపై బల్దియా సమావేశం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశం శనివారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఇందుప్రియ అధ్యక్షతన కొనసాగింది. 16 ఎజెండా అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. మొదట 14 అంశాలపై చర్చించగా సమావేశం మధ్యలో అదనంగా రెండు అంశాలను చేర్చి ఆమోదం తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిల్ సభ్యులు ఇన్‌చార్జి కమిషనర్, ఇతర విభాగాల అధికారులను నిలదీశారు. ఎజెండా అంశాల పత్రాలపై కమిషనర్ సంతకం లేకుండా సమావేశం ఏర్పాటు చేయడంపై అభ్యంతరం తెలిపారు. రెవెన్యూ విభాగంలో ఆయా వార్డులలో గృహాలకు ఇష్టారాజ్యంగా, పదింతలకు పైగా పన్నులు విధించారని వార్డుల్లో యజమానులు తమను నిలదీస్తున్నారని ఆర్‌వోపై మండిపడ్డారు. టౌన్‌ప్లానింగ్, సానిటేషన్ విభాగాలలో పనులు సక్రమంగా జరగడం లేవని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇన్‌చార్జి కమిషనర్ వేణుగోపాల్, టీపీవో గిరిధర్, ఆర్‌వో గోపాల్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు డీసెంట్ నోటీస్

మున్సిపల్ కమిషనర్ సంతకం లేకుండా ఎజెండా ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించారని 8, 27, 44 వార్డుల కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, ప్రముఖ, అపర్ణలు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు శనివారం డీసెంట్ నోటీసును అందజేశారు. సీఎం జన్మదిన వేడుకలలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని నోటీసులో పేర్కొన్నారు.

మార్పు కోసం కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామాల అభివృద్ధి, మార్పు కోసం ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. జుక్కల్ మండలం హంగర్గ గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి నామినేటెడ్ పదువులు లభిస్తాయని చెప్పారు. పార్టీలో ఉంటూ గ్రూప్ రాజకీయాలు చేస్తే సహించే ప్రసక్తి ఉండదన్నారు. నాయకులు సాయాగౌడ్, శివాజీ పాటిల్ తదితరులు ఉన్నారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి

బిచ్కుంద(జుక్కల్): కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి చేపట్టే పనుల నివేదిక తయారు చేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం బిచ్కుంద మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించుకుందామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి, పార్టీకి కార్యకర్తలు మూలస్తంభాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలోనే ఉంటాయన్నారు. సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రవి పటేల్, ఆయా గ్రామాల, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్(జుక్కల్): జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాలకు చెందిన 212 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. నాయకులు పాత్రు కిషోర్, రమేష్‌దేశాయ్, శివానంద్ పటేల్, అస్పత్‌వార్ వినోద్, అనిల్, పెద్దకొడప్‌గల్ ఆర్‌ఐ అంజయ్య, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులున్నారు.

ఆలయాల వద్ద రాజకీయాలు మానుకోవాలి



మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

మోర్తాడ్/నిజామాబాద్ సిటీ: ఆలయాల వద్ద రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి సూచించారు. దేవుని కోసం మనం వెళ్లాలి తప్ప.. దేవుడు మనకోసం ఆగరని గుర్తించాలని ఆయన హితవు పలికారు. దైవ దర్శనం కాకుండా తనపై కుట్ర పన్నారని ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మానాల మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. లింబాద్రి గుట్ట జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం, కొందరు రోడ్లకు ఇరువైపులా వాహనాలను వదలి పెట్టి దర్శనానికి వెళ్లడం, మరో ముగ్గురు రాంగ్ రూట్‌లో రావడం కారణంగానే ట్రాఫిక్ జామ్ అయ్యిందని స్పష్టం చేశారు. దీనికి ఏదో రాజకీయం జరిగిందని లేనిపోని విషయాలను ఊహించుకుని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి రాజకీయం చేయాలని చూడటం సమంజసంగా లేదన్నారు. ట్రాఫిక్ జామ్ కావడంతో తనతోపాటు ఈరవత్రి అనిల్, సునీల్‌రెడ్డి, ఇతర నాయకులు సైతం రెండు కిలోమీటర్లు నడిచి గుట్టకు చేరుకున్నామని తెలిపారు. అధికారం కోల్పోవడంతో అప్పటి దర్పం లేదనే ఆలోచనలో ఏవేవో మాట్లాడటం సరికాదన్నారు. అధికార పక్షంలో లేనివారికి దైవ దర్శనం జరగకుండా ఆపే సంస్కృతి గతంలో ఏ పార్టీకి ఉందో ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. రాజకీయం ఎక్కడ చేయాలో అక్కడ చేస్తేనే ప్రజలు స్వాగతిస్తారని, ప్రజా సంక్షేమంపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు.

ఎస్‌జీఎఫ్ బేస్‌బాల్ అబ్జర్వర్‌గా గంగామోహన్



నిజామాబాద్‌నాగారం: నిర్మల్ జిల్లాలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ అండర్ – 17 బేస్‌బాల్ రాష్ట్ర టోర్నమెంట్ అబ్జర్వర్‌గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ వ్యవహరించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు సంగీతరావు, నీరజారెడ్డి, పవన్‌కుమార్, రాజ్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డాక్టర్ నరసింహారావు, సునీత, కృష్ణ,మాలతి, గంగాధర్ అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన



దోమకొండ: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి మాట్లాడారు. డయల్ 100, మద్యం సేవించి ప్రయాణాలు, హెల్మెట్ ధరించడం తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామారెడ్డి పోలీస్ కళాబందం సభ్యులు ప్రభాకర్, సాయిలు, ఏఎస్సై, సిబ్బంది చంద్రకాంత్ తదితరులున్నారు.

80 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ నర్సింలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 80 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు సొసైటీ చైర్మన్ నర్సింలు తెలిపారు. మాల్తుమ్మెద సొసైటీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, సొసైటీ పాలకవర్గ సభ్యుల సహకారంతో ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు 2 లక్షల బస్తాల ధాన్యం తూకం చేశామని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ ధాన్యం సేకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేస్తామన్నారు. సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, సిద్ధయ్య, రామక్రిష్ణ, సొసైటీ మాజీ చైర్మన్ రాజిరెడ్డి ఉన్నారు.

క్రైం కార్నర్

తాగిన మైకంలో చెరువులో దూకి ఆత్మహత్య



హన్మాండ్లు మృతదేహం

నవీపేట: నవీపేట శివారులోని తడగామ చెరువులో దూకి మండల కేంద్రానికి చెందిన ముదాడం హన్మాండ్లు (39) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం తాగిన మైకంలో బయటకు వెళ్లిన హన్మాండ్లు ఇంటికి తిరిగి రాలేదన్నారు. గతంలో తాగిన మైకంలో ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు. మద్యానికి బానిసైన హన్మాండ్లు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి మహిళ మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన ఆవునూరి సాయవ్వ(38) అనే మహిళ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. బిడ్డల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చేందుకు భర్త దుబాయికి వెళ్లగా అతడికి అక్కడ ఉపాధి లభించకపోవడంతో డబ్బులు పంపించడం లేదు. ఇక్కడ అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన సాయవ్వ గురువారం గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని టేక్రియాల్ బైపాస్ వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేసిన పోలీసులకు 110 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చందూలాల్, ఆశిష్ తోపాటు మరొకరిని (మైనర్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా కామారెడ్డిలో నివాసముంటూ కార్పెంటర్ పనులు చేస్తున్న ముగ్గురు బైక్‌పై టేక్రియాల్ వైపు వెళ్లారు. వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఇటీవల యూపీకి వెళ్లిన ఓ యువకుడు అక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చినట్లు తెలిసింది. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఒకరి అదృశ్యం

సిరికొండ:మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. కుటుంబంలో గొడవల కారణంగా ఈనెల 14న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయిందన్నారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎత్తొండ శివారులో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు సమాచారమిచ్చినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

యంచ వద్ద వాహనాల తనిఖీ


నవీపేట: మండలంలోని యంచ చెక్ పోస్ట్ సమీపంలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. నిజామాబాద్ అడిషనల్ డీసీపీలు కోటేశ్వర్‌రావు, బస్వారెడ్డి, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఏబీవీపీ ఆందోళన నేపథ్యంలో చలో ట్రిపుల్ ఐటీకి వెళ్లకుండా వాహనాల తనిఖీ చేపట్టారు. 12 మందిని అనమానితులను అదుపులోకి తీసుకున్నారు.

అదుపు తప్పిన స్కూల్‌బస్సు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు శనివారం ఉదయం మండలంలోని చిట్యాల శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. రోజూలాగే చిట్యాలకు వెళ్లిన స్కూల్ బస్సు గ్రామానికి చెందిన సుమారు 30 మంది విద్యార్థులను ఎక్కించుకొని కామారెడ్డికి వెళ్తుండగా చిట్యాల వైపు వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పింది. బస్సు పొదల్లో నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపారు. ఘటనా స్థలానికి విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

నాలుగు దుకాణాల్లో చోరీ



ఎల్లారెడ్డి: పట్టణంలోని తెలంగాణ భవన్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. పట్టణంలోని గ్రాండ్ రెస్టారెంట్‌లోని కౌంటర్ నుంచి రూ.3వేలు, పక్కనే ఉన్న దుకాణంలో నుంచి ఆయిల్ డబ్బాతోపాటు మరో దుకాణంలో నుంచి పెయింట్ డబ్బాలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో బలుస శ్రీనివాస్ అనే వ్యక్తిపై అకారణంగా దాడికి పాల్పడిన చింతకుంట శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శనివారం తెలిపారు. బలుస శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ భూమిని చింతకుంట శ్రీనివాస్ కౌలు చేస్తున్నాడని, కౌలు డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. ఈ క్రమంలో తనపై చింతకుంట శ్రీనివాస్ దాడి చేశాడని బాధితుడు బలుస శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు.

క్రీడా సమాచారం

- రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



శ్రీహరి



చందన

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీహరి, పడకల్ గ్రామానికి వొల్కాజీ చందన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎం లింగన్న, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికైన వీరు శనివారం నుంచి సోమవారం వరకు మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

- రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు..



మోర్తాడ్(బాల్కొండ): రెజ్లింగ్, కరాటే, కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు తిమ్మాపూర్ విద్యార్థులు ఎంపికైనట్లు ఉన్నత పాఠశాల పీఈటీ సింధూజ తెలిపారు. శనివారం నిర్వహించిన జిలాస్థాయి పోటీల్లో మనోజ్ఞ, అక్షిత(7వ తరగతి), నవ్య(8వ తరగతి) ఉత్తమ ప్రతిభకనబర్చి ఆదివారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఉషూ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారన్నారు.

- రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు..



మాక్లూర్: క్యూరియస్ అకాడమీలో శిక్షణ పొందిన మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన గంగోనే రుషికేశ్, రాఘ పూజిత, స్నికిత అండర్ –19 విభాగంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14న నిజామాబాద్ నగరంలో నిర్వహించిన ఎంపికలో రుషికేష్, పూజిత, స్నికితలు ఉత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన క్రీడాకారులు బయల్దేరి వెళ్లినట్లు అకాడమీ నిర్వాహకుడు గంగోనె వినోద్ తెలిపారు.

- ఎస్‌జీఎఫ్ బేస్‌బాల్ పోటీలకు..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రి రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్ – 17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణచందర్ తెలిపారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో రోహన్, హర్ష పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ సాయన్న, ఉపాధ్యాయులు దయాళ్, గంగాధర్, చక్రపాణి, పీడీ జ్ఞానేశ్వర్, పీఈటీ రాజేందర్ అభినందించారు.

- విద్యార్థులకు క్విజ్ పోటీలు



నిజామాబాద్‌అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంత రెడ్డి రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు తారకం, బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఓవరాల్ చాంపియన్ ధర్మారం గురుకులం

డిచ్‌పల్లి: ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు కంజర గురుకులంలో నిర్వహించిన 10వ జోనల్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ధర్మారం (బి) గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల విద్యార్థినులు అన్ని విభాగాల్లో ఓవర్ ఆల్ చాంపియన్‌గా నిలిచారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నోర్రిసా, ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పీఈటీ స్వప్న, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

రేపు జిల్లాస్థాయి ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లా(నిజామాబాద్, కామారెడ్డి) రూరల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ బాలబాలికల బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్ ఎంపిక పోటీలను ఈ నెల 18న నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి మహేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ సెలక్షన్స్‌ను పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో నిర్వహిస్తమాని పేర్కొన్నారు. క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 20వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న పోటీలకు పంపిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 90145 81059, 70132 20107 నంబర్లను సంప్రదించాలని సూచించారు.